పార్క్ చేసిన వాహనాలే టార్గెట్

- మర్రిపాలెంలో ఆటోలు, బైక్‌ల చోరీ
- లబోదిబోమంటున్న బాధితులు
- ప్రశ్నార్థకంగా పోలీసుల తీరు..!

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెంలో పలు చోట్ల ఆటోలు, బైక్‌ల దొంగతనాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు ఇచ్చినా.. పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పలు దొంగతనాల కేసుల్లో పోలీసుల తీరు ప్రశ్నార్థకంగా ఉందని అంటున్నారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కొందరు బాధితులు ఇష్టపడటం లేదు.

ఆటో మాయం.. చర్యలు శూన్యం

104 ఏరియాలో నివసిస్తున్న దాసరి రామారావు అనే వ్యక్తి స్కూల్ పిల్లల కోసం ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ రాత్రి సమయంలో ఏపీ31 టీబీ 4422 అనే ఆటోను 104 ఏరియా ప్రధాన రహదారి ప్రాంతంలో తన ఆటోను పార్క్‌చేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం రోజూలాగే ఆటో కోసం వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో అతడు కంచరపాలెం ఐదో పట్టణ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు సమీపంలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఒక యువకుడు ఆటోను దొంగిలించుకుని వెళ్తున్నట్టు తెలిసింది. బాధితుడు విషయాన్ని పోలీసులకు వివరించినా.. వారు స్పందించకపోవడంతో 1902కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశామని బాధితుడు రామారావు తెలిపాడు. దీంతో పది రోజుల తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపేసుకున్నారని బాధితుడు వాపోయాడు. ఆటో దొరక్క పోవడంతో పలువురి సాయం మేరకు కొత్త ఆటోను కొని స్కూల్ పిల్లలను దింపుతూ జీవనం సాగిస్తున్నాడు.


బ్యాటరీ తీసేసిన కొత్త ఆటో

ఇదిలా ఉండగా.. దాసరి రామారావు తన కొత్త ఆటో(ఏపీ39 యూవీ 4402)ను ఈ నెల 16వ తేదీ రాత్రి తెలిసిన వారి ఇంటి వద్ద జ్యోతినగర్‌లోని ఓ స్కూల్ సమీపంలో లాక్ చేసి పార్క్‌చేసి ఇంటికి వెళ్లి పోయాడు. తిరిగి 17న ఉదయం చూడగా ఆటోలోని బ్యాటరీని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఆయన తెలిపాడు. ఫిర్యాదు చేయమని పలువురు స్నేహితులు చెప్పినా.. పాత ఆటో కేసుకే దిక్కులేదు ఇప్పుడు బ్యాటరీ కోసం ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని, ఎవరూ పట్టించుకోరని ఫిర్యాదు చేయకుండా ఉండిపోయాడు సదరు ఆటో బాధితుడు.

బ్యాటరీలు, టైర్లు, పెట్రోల్ దొంగతనాలు

ఇటీవల పాత ఆటో పోయిందని కలెక్టర్ కార్యాలయంలో కూడా అర్జీ పెట్టాడు బాధితుడు రామారావు. కేవలం ఇతనొక్కడిదే కాదు.. ఇలా మర్రిపాలెంలోని సర్వీస్ రోడ్డులో పార్క్‌చేసిన ఉంచిన వాహనాలను దుండగలు టార్గెట్ చేసి రాత్రి పూట వాటి బ్యాటరీలు, టైర్లు తీసేస్తున్నారు. ఎవరూ లేని సమయంలో పెట్రోల్ దొంగతనాలు కూడా అధికంగా జరుగుతున్నాయి.


చోరీకి గురైన పాత ఆటోతో దాసరి రామారావు

తాజాగా 53వ వార్డు మర్రిపాలెం శ్రీహర్షనగర్ రైల్వే క్వార్టర్స్ వద్ద సోమవారం పార్క్‌చేసి ఉన్న ఆటోను మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ ఘటనపై బాధితుడు టి.గణపతి ఫిర్యాదు చేయగా.. క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల గస్తీ కరువైందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా వాహనాలు పోగొట్టుకున్న కొందరు ఫిర్యాదు చేయడానికి కూడా మొగ్గు చూపించడం లేదు. ఈ ప్రాంతాల్లో పోలీసులు దృష్టి సారించి వాహనాల చోరీకి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

జీవితానుభవాల నుంచే కథలు

సీతంపేట: రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకలింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు.


మాట్లాడుతున్న రచయిత సుగుణరావు

సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

సీతమ్మధార: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పందిరి కూరగాయల సాగు, వేసవిలో పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, మల్చింగ్ పద్ధతిలో కూరగాయుల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, వన్ బీ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్, ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఈవో పి.కొండబాబు, సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాల్లో దుర్గంధం

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ద్వారం దుర్గంధభరితంగా మారింది. రాంజీ ఎస్టేట్‌లో శానిటరీ పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాఠశాల పరిసరాల్లో నిత్యం చెత్తాచెదారాన్ని నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. ప్రధాన ద్వారం వద్దే చెత్త కుండీని ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. గేటు వద్దే వాహనాలు పార్క్‌చేయడంతో పాఠశాల లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త, వాహనాల పార్కింగ్

లలితా పీఠంలో దక్షిణామూర్తి ఆరాధన


దక్షిణామూర్తి పరమహంసకు హారతిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస ఆరాధన జరిగింది. లలితానగర్‌లోని పీఠం ఆవరణలో గల దక్షిణామూర్తి మందిరంలో స్వామికి విశేష అభిషేకం, అర్చన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు, ప్రస్తుత లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి స్వయంగా దక్షిణామూర్తికి ప్రత్యేక హారతి సమర్పించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్త నత్కీర నాటక ప్రదర్శన

సీతంపేట: శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రంగస్థల కళాకారుడు, పలు నంది పురస్కారాల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన భక్త నత్కీర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి మహత్స్యం కావ్యం ఆధారంగా మీగడ రామలింగస్వామి రచించిన ఈ నాటకంలో ఆయన నత్కీరుడు పాత్ర అద్భుతంగా పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదుడిగా డాక్టర్ అత్తిలి శంకర్, హరద్విజుడుగా ధూపం గురుమూర్తి, మహామంత్రి కె.గోపినాయుడు, మహాశివుడుగా జి.సూర్యనారాయణ, బాల శివభక్తులుగా హనీష్, సహస్ర, దాసరిగా రుద్రనారాయణ, బుడత కీచకుడిగా డాక్టర్ మోహనరావు, రాజనర్తకిగా ఎస్.సరస్వతి తదితరులు చక్కని నటనతో రసోచితమైన పద్య పఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. వీరికి హార్మోనియంపై మీగడ మల్లికార్జున స్వామి, డోలక్‌పై కె.బాలకృష్ణ వాద్య సహకారం అందించారు. అలంకరణ, ఆహార్యం మీరా, సత్యం చేశారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరిగిన నాటక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా స్వామి వారి చేతుల మీదుగా నాటక బృందాన్ని ఘనంగా సత్కరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


నాటకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

ఒకే చోట రెండు డంపర్ బిన్లు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో వివేకానంద కల్యాణ మండపం వద్ద రెండు డంపర్ బిన్లు ఒకే చోట నిరుపయోగంగా ఉన్నాయి. అవసరం లేని చోట రెండు ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న చోట డంపర్ బిన్లు లేకపోవడంతో స్థానికులు చెత్తను రోడ్డుపై వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. 24వ వార్డులో చాలా చోట్ల డంపర్ బిన్లు లేకపోవడం వల్ల హోటళ్లు, తోపుడు బళ్లు, టిఫిన్ షాపులకు చెందిన చెత్తను రోడ్డు పక్కన డంప్ చేయడంతో కుక్కలు, పశువులు చెల్లాచెదురు చేస్తున్నాయి. రాకపోకల సమయంలో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో నిరుపయోగంగా రెండు డంపర్ బిన్లు

ఇబ్బందికరంగా భవన నిర్మాణ పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో భవన నిర్మాణ పనులు ఇబ్బందికరంగా సాగుతున్నాయి. రోడ్లను ఆక్రమించి ఇసుక, ఇటుక, పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రి వేయడంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతంలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. భవన నిర్మాణదారులు ఇష్టానుసారంగా పనులు చేయించడం వల్ల బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.


బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారిలో వేసిన ఇసుక

సమాజంలో లింగ సమానత్వం అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణుడు శివ

ఏయూ క్యాంపస్: సమాజంలో లింగ సమానత్వం ఎంతో అవసరమని ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ చప్పా అన్నారు. ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్, నేస్తం సోజిక్స్ సంయుక్తంగా ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ సమానత్వం, ఎల్‌జీబీటీక్యూఐఏ హక్కులు, మానవ హక్కులు, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. 8 నుంచి 10వ తరగతికి చెందిన 200 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలకు తమ సంస్థ తరఫున నిర్వహిస్తామన్నారు. జన్మతహ వచ్చిన జెండర్‌ను కొనసాగించడం, సమాజంతో అందరితో సమానంగా జీవించడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి మాట్లాడుతూ ఎంతో సున్నితమైన అంశంపై నిపుణులు విస్తృత అవగాహన కల్పించారన్నారు. జెండర్ స్టడీస్ నిపుణుడు శివ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా సమాజంలోని వివిధ వ్యక్తులు, వారి మధ్య లింగ సమానత్వం, వారి హక్కులను తెలుసుకుంటూ పరస్పరం గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు.

దోమల నిర్మూలనకు ఫ్రైడే డ్రైడే తప్పనిసరి

జగదాంబ: దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం ప్రజలంతా డ్రైడేగా పాటించాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ సూచించారు. బుధవారం జీవీఎంసీ 39వ వార్డులో డ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో ఉన్న నిల్వ నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కుండీలు, నీటి డ్రమ్‌లకు క్లాత్ చుట్టి పెట్టుకోవాలన్నారు. ఇంట్లో ఫ్రీజ్‌లు వెనక ఉన్న నీటిని కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. వర్షం కురిసిన తరువాత పారిశుధ్య సిబ్బంది నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.


దోమలకు నిలయమైన వస్తువులను చూపి అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

కిటకిటలాడుతున్న కేజీహెచ్

మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునికీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లూ కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.


కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో మెరిసిన బాలికలు

సీతమ్మధార: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో పీ అండ్ టీ కాలనీ ఎన్ఎంసీ హైస్కూల్ ప్లస్ కళాశాల విద్యార్థినులు మెరిశారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 24 మందికి 14 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా.. ఆరుగురు పాస్ అయ్యారు. బైపీసీలో 9 మందికి ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో 11 మందికి ఏడుగురు పాసయ్యారు. బైపీసీలో ఏడుగురికి ఒక్క బాలిక పాసైంది. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో కనకమహాలక్ష్మి 378/470 (80 శాతం), బైపీసీలో నిహారిక 240/470 మార్కులు సాధించినట్లు హెచ్ఎం డి.రాంప్రసాద్, అధ్యాపకురాలు ప్రియదర్శిని తెలిపారు.

అలరించిన సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయనీ గాయకుడు

సీతంపేట: స్వర సంగమం(హైదరాబాద్), స్వర మాధుర్యం(వైజాగ్) సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి పి.వి.రఘుపతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. గాయనీ గాయకులు ఆనందరెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ, శశిరాణి, శైలజ మెరాజ్, మాధవి అద్భుతంగా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం


వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

మురళీనగర్: పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఏజ్ కేర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జీరియాటిక్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఏఎస్ రాజు, ఇతర వైద్య బృందం పట్టాభిరెడ్డితోట పరిసర ప్రాంతాల నుంచి పాల్గొన్న వారికి, ఆశ్రమంలోని వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్ అవసరమైన ఏర్పాట్లు చేశారు.

వర్షానికి కూలిన భారీ వృక్షం


క్రౌన్ బేకరీ వద్ద రోడ్డుపై కూలిన చెట్టు

సీతంపేట: నగరంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి శంకరమఠం రోడ్డులో క్రౌన్ బేకరీ జంక్షన్ వద్ద భారీ చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వర్షం కురుస్తుండటంతో రాకపోకలు పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో ఒకవైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండో వైపు వాహనాలు రాకపోకలు సాగించడంతో రద్దీ ఏర్పడింది. మరోవైపు జోరువానలో జనం తడుస్తూ ప్రయాణాలు సాగించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు


గోపాలపట్నం పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలను వివరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు

గోపాలపట్నం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం గోపాలపట్నం ప్రధాన రహదారిలో అవగాహన ర్యాలీ చేపట్టారు. సీఐ ఉపేంద్ర మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు కలిగి ఉండడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.దాసు, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో చేటు

మల్కాపురం: మాదకద్రవ్యాలు సేవించడం వల్ల విలువైన జీవితం నాశనం అవుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం బ్రాంచ్) నిర్వాహకులు సింధూ సిస్టర్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూల దినోత్సవం సందర్భంగా 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మద్యం,గంజాయి, గుట్కా,పాన్‌పరాగ్ వంటి అలవాట్లకు నేటి యువత దగ్గరవుతున్నారని ఆవేదన చెందారు. వాటిని సేవించడం వల్ల విలువైన యువత జీవితం మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి నెలకుంటుందన్నారు. దేవుడు ఇచ్చిన విలువైన జీవితాన్ని సద్వినియోగం చేసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకునే విధంగా నడుచుకోవాలే తప్పా,మాదకద్రవ్యాల జోలికి పోవద్దు అని యువతకు సూచించారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల మానవజీవితం ఎలా నాశనం అవుతుందో పోస్టర్లు ప్రదర్శించారు.

- మత్తు యువత జీవితాన్ని చిత్తు చేస్తుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు అలవాటు చేసుకుంటే కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జ్ఞాపికలు అందించారు.


మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న బ్రహ్మకుమారీ తదితరులు

కేజీహెచ్‌లో షెడ్డు ప్రారంభం నేడు

మహారాణిపేట: కేజీహెచ్‌లో పిల్లల వార్డు వద్ద రోగుల సహాయకుల కోసం రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును గురువారం ప్రారంభించనున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు పడే ఇబ్బందులు చూసిన అప్పటి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున షెడ్డు నిర్మాణానికి సహకారం అందించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఏఈ నాయుడు ఆధ్వర్యంలో షెడ్డు నిర్మించారు. కేజీహెచ్‌లో ఇప్పటి వరకు పలు వార్డుల్లో రోగుల సహాయకుల కోసం 10 షెడ్లు నిర్మించారు. ఇప్పుడు పిల్లల వార్డు వద్ద 11వ షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభిస్తారని కేజీహెచ్ సూపరింటెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొంటారని చెప్పారు.


రోగుల సహాయకుల కోసం కేజీహెచ్‌లో నిర్మించిన షెడ్డు లోపలి భాగం